క్లుప్తంగా

ప్రభ నిర్మాణదారులకు సన్మానం



జి.అగ్రహారంలో అర్చకుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

అంబాజీపేట: గత ఏడాది గణతంత్ర వేడుకల్లో కోనసీమ రుద్రప్రభలు నమూనాను ప్రదర్శించడంతో ఏకాదశ రుద్రులకు విశ్వవ్యాప్త కీర్తి లభించింది. అందుకు కారకులైన గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ నిర్మాణదారులను, శివకేశవ యూత్ సభ్యులను, అర్చకులను పెదపాలెం గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గణతంత్ర వేడుకల్లో ప్రభల శకటం ప్రదర్శించడానికి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ కృషి ఎంతో ఉందని పలువురు పేర్కొన్నారు. 2020లో యూత్ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రుల విశిష్టతను ప్రధాని మోదీకి లేఖ రాయటంతో ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యంపై మంగళాశాసనాలతో సందేశం పంపారన్నారు. గత 450 ఏళ్లుగా ప్రభల ఉత్సవం జరుగుతున్నప్పటికీ గణతంత్ర వేడుకల ప్రదర్శన వల్ల ఈ ఏడాది భారీగా భక్తులు రావడం, ఆధ్యాత్మిక శోభతో భక్తులు పరవశించిపోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన బుర్రా సాయిమాధవ్, వెంకటసీత దంపతులు రూ.11,116 విరాళంగా అందించారు. దాతను ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ అభినందించారు. దాత కుటుంబ సభ్యులకు ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, ఆలయ ఉద్యోగులు, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

షట్టర్ ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్



నగరంలో డ్యామ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మామిడికుదురు: నగరంలో పంట కాలువ డ్యామ్‌కు షట్టర్ లేకపోవడం వల్ల సాగునీరు కాలువ దిగువ ప్రాంతానికి వెళ్లిపోయి నగరం, గెద్దాడ గ్రామాల్లో 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సమస్య ఏర్పడుతుందని రైతులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ నెలకొన్న సమస్యను చాలా చార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్యామ్‌కు షట్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రైతులు గంధం శ్రీనివాసు, చిట్టూరి ఏసు, గుబ్బల ఏసుబాబు, బొక్కా శ్రీరామ్మూర్తి, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య మాట్లాడుతూ 2024-25నికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.కృష్ణమోహన్, ఏఓ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

ముగిసిన పండగ

- మూగబోయిన పల్లెలు
- గ్రామాల్లో ముగిసిన హరినామ సంకీర్తనలు
- తిరుగు ప్రయాణమైన హరిదాసులు



కొత్తపేటలో హరిదాసుకు స్వయంపాకం అందిస్తున్న భక్తులు

కొత్తపేట: పండగ ముగిసింది.. సందడి ఆగిపోయింది.. పిల్లల కేరింతలతో కళకళలాడిన పల్లెలు మూగపోయాయి.. హరిదాసుల సంకీర్తనలు ఆగిపోయాయి.. పల్లెలకు వచ్చిన వారు పట్టణాలకు తిరుగు ప్రయాణమవుతుండగా వారి తల్లిదండ్రులు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కొండంత బాధతో వీడ్కోలు చెప్పారు. సెలవులు ముగించుకుని పట్టణాలకు బయలుదేరిన విద్యార్థులు ఏదో కోల్పోయిన భావనతో పల్లెలకు టాటా చెప్పారు.

శ్రీమద్రమా రమణ గోవిందో హరి...

ధనుర్మాసం నెల రోజుల పాటు గ్రామాల్లో వినిపించిన హరినామ సంకీర్తనలు ముక్కనుమతో ముగిశాయి. గత నెల 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల్లో నివసించే హరిదాసులు తమకు కేటాయించిన గ్రామాల్లో ధనుర్మాసం రాకకు ప్రతీకగా శ్రీమద్రమా రమణ గోవిందో హరి... అంటూ హరినామ కీర్తనలతో గ్రామాల్లో ప్రవేశించారు. తలపై అక్షయపాత్ర, మెడలో పూలదండ, పట్టు పీతాంబరాలు, నుదుట నామాలు ధరించి, ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబుర పట్టి, కాళ్లకు గజ్జెలు, కమ్మని కంఠస్వరంతో విష్ణునామ స్మరణతో తెల్లవారుజాము నుంచే క్రమం తప్పకుండా వీధుల్లో దర్శనమిచ్చారు. ధనుర్మాసం ముగియడంతో మంగళవారం హరిదాసుల హరినామ సంకీర్తనలు వినిపించలేదు. అయితే గ్రామాలు, వీధుల్లో దర్శనమిచ్చారు. తలపై అక్షయపాత్ర లేదు, తంబుర, చిడతలు చేతిలో లేవు. వారి రాకను గుర్తించిన భక్తులు ముఖ్యంగా మహిళలు ప్రతీ రోజు మాదిరిగా అక్షయపాత్రలో పోసే స్వయంపాకంతో పాటు సంక్రాంతి పిండివంటలు, నగదు, బహుమతులు సమర్పించారు. సంక్రాంతితో మా హరినామ సంకీర్తన ముగిసింది.. ఆ శ్రీహరి ఆశీర్వదిస్తే మళ్లీ వచ్చే ధనుర్మాసానికి వస్తానమ్మా.. అంటూ గ్రామస్తుల వద్ద సెలవు తీసుకున్నారు. ఆ సందర్భంగా హరిదాసులకు వీడ్కోలు పలికారు. పలువురు నూతన వస్త్రాలతో సత్కరించి సాగనంపారు.

రథం ముగ్గుతో రంగవల్లులకు వీడ్కోలు

మకర సంక్రమణంతో ధనుర్మాసం ముగిసింది. ఆ ధనుర్మాసం అన్ని రోజులు వివిధ రకాల రంగవల్లులతో కళకళలాడిన వాకిళ్లు ధనుర్మాసాన్ని సాగనంపడానికి ప్రతీకగా రథం ముగ్గు వేస్తారు. నవరాత్రులు అనంతరం విగ్రహాలను సాగనంపి నిమజ్జనం చేసినట్టుగా ముగ్గులను ముగ్గుతోనే సాగనంపుతారు. అలా ముక్కనుమ నాడు (నాలుగో రోజు) బుధవారం సూర్యోదయానికి ముందే వాకిట్లో రథం ముగ్గు వేసి వీధిలో వేసిన భోగి మంటకు కలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లాలి



పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: విజయవాడలో ఈనెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అందరూ తరలివెళ్లాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం దళిత నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో విప్పర్తి మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో రూ.404 కోట్లతో దేశంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించారని ఆయన వివరించారు. అంబేడ్కర్ మహాశిల్ప విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలివెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని విప్పర్తి అన్నారు. జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు సరెళ్ల అప్పారావు, సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, ఎస్.రాజేంద్రప్రసాద్, నాలుగు మండలాలకు చెందిన దళిత నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రికెట్ పోటీలు

ఆలమూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల స్థాయిలో క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో పాల్గొనే ఈ క్రికెట్ పోటీలను మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల గ్రామాల్లోని లేఅవుట్లలో నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతను నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని ఎంపీడీఓ జాన్‌లింకన్ పేర్కొన్నారు.

హోరాహోరీగా మండల స్థాయి పోటీలు



మామిడికుదురులో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు

మామిడికుదురు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. బాలుర, బాలికల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో యువకులు, యువతులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. పాశర్లపూడిలంక ఓఎన్జీసీ గ్రౌండ్‌లో బాలుర క్రికెట్ పోటీల్లో యువకులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మహిళల బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ కె.వెంకటేశ్వరరావు పోటీలను పర్యవేక్షించారు. మండల స్థాయి పోటీలు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఘనంగా అంబాజీపేట ప్రభల తీర్థం



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా ముక్కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) బుధవారం ఘనంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గొడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువురిని అలరించాయి.

పండగలు ఐకమత్యానికి ప్రతీక

అంబాజీపేట: పండగలు ఐకమత్యానికి ప్రతీకలని, మానవులు కలసిమెలసి జీవించేందుకు దోహదపడతాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గొడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అయినవిల్లి ఎస్సై సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువురిని అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ప్రభల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ హిందువుల అతి పెద్ద పండగ సంక్రాంతి పర్వదినం ఎంతో పాశస్త్యాన్ని కూడుకుందన్నారు. అడ్డగళ్ల వెంకట సాయిరామ్, మట్టపర్తి హరి, కొక్కిరి రవికుమార్, కల్వకొలను తాతాజీ, అడ్డగళ్ల శ్రీను, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ముగిసిన పడవ పందేలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గ్రామంలో జరిగిన సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ రాష్ట్రస్థాయి పడవల, ఈత పోటీలు బుధవారం ముగిశాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చొరవతో చిర్ల యూత్ ఫోర్సు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ ప్రకాష్ నిర్వహణ సారథ్యంలో మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పడవలు, ఈతల పోటీలను ప్రజలు ఆనందోత్సాహాలతో వీక్షించారు. పడవల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.లక్ష, రెండో స్థానం సాధించిన ఆత్రేయపురం, రావులపాలెం టీమ్ రూ.50 వేలు, మూడో స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.30 వేలు, ఈతల పోటీల్లో ప్రథమస్థానం సాధించిన ఎం.దొరబాబుకు రూ.10 వేలు, రెండోస్థానం సాధించిన ఎం.ప్రకాష్‌కు రూ.7 వేలు, మూడోస్థానం సాధించిన కామేష్‌బాబుకు రూ.3 వేలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వినూత్నమైన ఈ పడవ పోటీలను మన ప్రాంతానికి పరిచయం చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం



పాప కుటుంబానికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు



బాధితుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వ్యక్తికి వైద్యం కోసం బుధవారం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన సంపర శ్రీనివాసాచార్యులు అకస్మాత్తుగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ ఉందని వెంటనే ఆపరేషన్ చేయాలని దీనికి రూ.18 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో సాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం చేయమని కోరగా రూ.13 వేల నగదు సాయంగా అందజేశారు.

బ్రెయిన్‌ట్యూమర్ బాధితురాలికి రూ.17 వేలు

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న మూడేళ్ల పాపకు స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు రూ.17 వేలు ఆర్థిక సాయం అందజేసినట్టు సభ్యులు బుధవారం తెలిపారు. పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన విల్లా తేజశ్రీ సత్యలక్ష్మి 3 సంవత్సరాల పాప బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుంది. వైద్య చికిత్స నిమిత్తం పాప కుటుంబానికి రూ.17 వేలు సాయం అందినట్టు సభ్యులు తెలిపారు.

వైభవంగా గ్రామ దేవతల తీర్థాలు



పెదపళ్లలో ప్రభలను భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. పెదపళ్లలో వేంచేసిన పోలేరమ్మ, చొప్పెల్లలోని దానాలమ్మ, గుమ్మిలేరులో వేంచేసిన గ్రామ దేవతలు ఉరదాలమ్మ, దండు గంగమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు తిలకించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామ మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్‌లంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉరదాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన జాతర భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, సన్నాయి, బ్యాండు మేళాలు, శక్తి వేషాలు, తీన్‌మార్ తదితర వినోద కార్యక్రమాలతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న ప్రభల ప్రదర్శన

మండలంలోని పెదపళ్లలో పోలేరమ్మ అమ్మవారి తీర్థోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రభల ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది. సన్నాయి, చర్మ వాయిద్యాల నడుమ శివ పార్వతులు కొలువైన ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఒకే చోట ప్రభల ఉత్సవం ఒక్కచోటే ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ప్రదర్శనగా ఉంచిన ప్రభలను దర్శించుకున్న భక్తులు అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు గ్రామ దేవత పోలేరమ్మను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేశనపల్లిలో కలసిన పూర్వ విద్యార్థులు



గురువులతో కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు



ఈదరాడలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మలికిపురం: మండలంలో కేశనపల్లి యెనుముల బ్రహ్మానందం జెడ్పీ ఉన్నత పాఠశాల 1990-91 పదో తరగతి చదివిన విద్యార్థిని, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాలు, ఉద్యోగాల నిమిత్తం విదేశాలకు వెళ్లిన వారు కూడా పండగ నేపథ్యంలో హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఆనంద సమయాలను అందరితో పంచుకోవటానికి వచ్చి ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఎప్పటికీ మరపురాని మధురానుభావాలను పంచుకున్నారు. తొలుత మృతి చెందిన మిత్రులు, గురువులకు నివాళులర్పించారు అనంతరం అప్పటిగురువు గంటా ప్రసాదరావు మాస్టారుని సన్మానించారు. అలాగే ప్రస్తుత ప్రధానోపాధ్యాయులను నాటి ఉపాధ్యాయులు శివరావు, రామారావుని ప్రస్తుత టీచర్లను సభావేదికపై సన్మానించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న 2002-07 బ్యాచ్ విద్యార్థినులు బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ ప్రాంగణంలో అడుగుపెడుతూనే పరస్పరం పలకరింపులతో నేటి జీవనయానంలో పరిస్థితులను మరచిపోయి ఆనందానుభూతికి లోనయ్యారు. చిన్ననాటి స్నేహాలను నెమరు వేసుకున్నారు. తరగతి గదిలో జరిగిన సంఘటనల జ్ఞాపకాల దొంతర్లను గుర్తు చేసుకున్నారు. ఆనాడు ఆ పాఠశాలలో ఐదేళ్ల పాటు గడిపిన రోజులు, ఉపాధ్యాయుల క్రమశిక్షణ, నేర్చుకున్న విద్య, స్థిరపడిన గమనాన్ని గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాల అవసరాలను తీర్చేందుకు తమ పరిధిలో కృషి చేద్దామని తీర్మానించారు. అనంతరం నాటి, నేటి గురువులను ఘనంగా సత్కరించారు. ఆఖరున గురువులతో అందరూ గ్రూప్ ఫొటో దిగారు.

ఈదరాడలో..

మామిడికుదురు: ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. 1989-90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి చిలిపి జ్ఞాపకాలను మననం చేసుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అంతా కలసి ఒక చోట కూర్చుని పంక్తి భోజనాలు చేశారు. తమకు విద్య నేర్పిన గురువులు పీవీ నారాయణాచార్యులు, హనీఫ్, గంగాధరం, మీర్జా అబ్బాస్, కొండయ్య, అలీషాలను ఘనంగా సత్కరించారు.

‘యర్రంశెట్టి’ వారి ఆత్మీయ కలయిక



కేశవదాసుపాలెం కాలువమొగ సెంటర్లో యర్రంశెట్టి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం కాలువమొగ సెంటర్లో బుధవారం సంక్రాంతి పర్వదినాల్ని పురస్కరించుకుని యర్రంశెట్టి అయ్యప్పనాయుడు న్యాయవాదిగా ప్రస్తావన చేపట్టి శత వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆయన మనుమలు, మునిమనుమలు, అనుమునిమనుమలు ఆత్మీయ కలయిక చేపట్టారు. మనుమడు నల్లా బాలాజీ ఇంటి వద్ద మునిమనుమడు సూదాబత్తుల రాజేష్ చొరవతో వారంతా కలుసుకున్నారు. కాగా అయ్యప్పనాయుడు కుటుంబంలో 4 తరాలు న్యాయవాదులు ఉన్నారని, ఓ తరానికి చెందిన కుమారుడే హరనాథ్‌బాబు. ప్రస్తుతం ఆయన రాజోలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాను, ఏపీపీగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అలాగే మనుమడు అయ్యప్పనాయుడు గత 30 సంవత్సరాలుగా రాజోలులో తాతగారి స్ఫూర్తితో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆత్మీయ కలయిక పురస్కరించుకుని కుటుంబంలో పెద్దలను సత్కరించుకున్నారు. వి.మాధవరావు, వి.అన్నపూర్ణ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో బీజేపీ నేతల శ్రమదానం



అప్పనపల్లి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

మామిడికుదురు: ప్రత్యేక స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా బీజేపీ నేతలు బుధవారం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాన్ని శుభం చేశారు. చీపుర్లు పట్టి ఆలయ పరిసరాలను శుభ్రం చేసి ఆలయాన్ని నీటితో శుభ్రం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు పార్టీ నేతలు ప్రత్యేక స్వచ్ఛతా అభియాన్‌లో పాల్గొన్నారు. ఈ నెల 22న దేశ ప్రజలంతా ఎంతో కాలం నుంచి వేచి చూస్తున్న అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం కావడం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పసుపులేటి మహాలక్ష్మీరావు, చెల్లింతి త్రినాథరావు, కోటిపల్లి సాయిబాబా, గుడాల పుల్లయ్యశెట్టి, కట్టా నారాయణమూర్తి, పాటోలు రామలింగేశ్వరరావు, ఏడిద బాబులు పాల్గొన్నారు.

కుహనా లౌకికవాద పార్టీ కాంగ్రెస్

మలికిపురం: కాంగ్రెస్ కుహనా లౌకికవాద పార్టీ అని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మలికిపురంలో మాట్లాడుతూ అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపనను హిందూ ధర్మంపై విశ్వాసం లేని కాంగ్రెస్ దూరంగా ఉండడం ఆ పార్టీ నైజాన్ని తెలియ జస్తుందన్నారు. అయోధ్య అంశంలో కుహనా లౌకికవాద పార్టీలే రాజకీయం చేస్తున్నాయని ఆయన అన్నారు. బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమం ప్రధాని మోదీ చుట్టూ తిరుగుతుందని అందువల్ల కాంగ్రెస్ పార్టీ హాజరుకామని ప్రకటించడం అర్థరహితమని ఆరోపించారు. అయోధ్య రామాలయాన్ని ధ్వంసం చేసిన బాబర్ సమాధిని సందర్శించి భక్తిశ్రద్ధలు కనబరిచిన కాంగ్రెస్ పార్టీ అని నగేష్ ఎద్దేవా చేశారు.